

పొద్దు తిరిగింది.. బతుకు మారింది!

- కట్కూరులో పొద్దు తిరుగుడు సాగు
- ఒకే గ్రామంలో 410 ఎకరాల్లో పంట
- తక్కువ పెట్టుబడి.. లాభాలు అధికం
- ఆసక్తి చూపిస్తున్న మిగతా రైతులు

7 లో..


ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా అధికారులను ఆదేశించిన అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్
- కలెక్టరేట్‌కు జిల్లా నలుమూల నుంచి వచ్చిన అర్జీదారులు

7 లో..



ప్రజావాణిలో వినతులను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్



సిద్దిపేట.. ఎవరికి పీట!

పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో సిద్దిపేట జిల్లాలో రాజకీయ వాతావరణం వేడెక్కుతున్నది. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోలిస్తే సిద్దిపేట కాస్త ప్రత్యేకం... ఈ జిల్లాలోని 26 మండలాలు మూడు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో విస్తరించి ఉన్నాయి. ముగ్గురు ఎంపీలకు ప్రొటోకాల్ ముడిపడి ఉంది. అయితే, ప్రధాన పార్టీల నుంచి ఏ స్థానం నుంచి ఎవరెవరూ బరిలో ఉంటారనే ఊహాగానాలు ఊపందుకున్నాయి. తాజా సమీకరణాలతో మెదక్‌తో పాటు కరీంనగర్, భువనగిరి పార్లమెంట్ స్థానాల గెలుపోటములు రసవత్తరంగా మారాయి.

- హాట్‌టాపిక్‌గా పార్లమెంటు ఎన్నికలు
- మూడు ఎంపీ స్థానాలతో జిల్లాకు బంధం
- గత ఎన్నికల్లో మూడు పార్టీలకూ అవకాశం
- ఒక్కోచోట ఒక్కో పార్టీకి మెజారిటీ
- మారిన సమీకరణాలతో సర్వత్రా చర్చ
- అభ్యర్థిత్వాలకు పోటీపడుతున్న ఆశావహులు
- రసవత్తరంగా మెదక్, కరీంనగర్, భువనగిరి పాలిటిక్స్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సిద్దిపేట, ఫిబ్రవరి 5: రాష్ట్రంలోని చాలా జిల్లాలు ఒకటి లేదా రెండు పార్లమెంట్ స్థానాల పరిధిలో విస్తరించి ఉన్నాయి. కానీ సిద్దిపేట జిల్లాలో 26 మండలాలు ఉంటే ఇందులో 18 మండలాలు మెదక్ లోక్‌సభ పరిధిలో ఉన్నాయి. మరో 4 మండలాలు కరీంనగర్ లోక్‌సభ పరిధి, ఇంకో 4 మండలాలు భువనగిరి పరిధిలో ఉన్నాయి. ఫలితంగా ఆయా రాజకీయ పార్టీల బలాబలాలు, పరిణామాలు జిల్లాపై ప్రభావం చూపించనున్నాయి.

మూడు పార్టీలకు మూడు సీట్లు

గత లోక్‌సభ ఎన్నికల్లో ఆసక్తికరమైన ఫలితాలు వచ్చాయి. ఒకే జిల్లాలో ఉంటూ సిద్దిపేట జిల్లా ప్రజలు వినూత్నమైన తీర్పు నివ్వడం ఆశ్చర్యాన్ని కలిగించింది. నాటి ఎన్నికల్లో మెదక్ ఎంపీగా పోటీచేసిన బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించారు. అదేవిధంగా కరీంనగర్‌లో బీజేపీ తరఫున బరిలోకి దిగిన బండి సంజయ్ అనూహ్య విజయాన్ని సొంతం చేసుకున్నారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న బీఆర్‌ఎస్ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్, మాజీఎంపీ, కాంగ్రెస్ అభ్యర్థిగా ఉన్న పొన్నం ప్రభాకర్ మీద పైచేయి సాధించడం సంచలనం సృష్టించింది. ఇక భువనగిరిలో కాంగ్రెస్ తరఫున పోటీలో నిలిచిన కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఈ జిల్లాకు సంబంధించిన మండలాలే అండగా నిలిచాయి. దీంతో ఆయన కూడా విజయం సాధించారు. బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్‌కు తలా ఒక సీటు దక్కింది. బీఆర్‌ఎస్ పార్టీకి కంచుకోటగా ఉన్న సిద్దిపేట ప్రాంతాన గత పార్లమెంట్ ఎన్నికల మూలాన కాంగ్రెస్, బీజేపీలు పాగా వేశాయి. జిల్లా ప్రజాప్రతినిధుల జాబితాలో ఆ రెండు పార్టీలకూ చోటు దక్కాయి.

రెండు సిట్టింగ్ స్థానాల్లో మార్పు

మెదక్ పార్లమెంట్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న కొత్త ప్రభాకర్‌రెడ్డి తాజా ఎన్నికల్లో దుబ్బాక ఎమ్మెల్యేగా గెలిచారు. బీఆర్‌ఎస్ తరఫున బరిలోకి దిగి భారీ మెజారిటీని సాధించారు. ఎంపీ పదవికి రాజీనామా సైతం సమర్పించారు. ఫలితంగా బీఆర్‌ఎస్ అభ్యర్థిత్వం మారనున్నది. అదేవిధంగా భువనగిరి సిట్టింగ్ ఎంపీగా ఉన్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి కూడా అసెంబ్లీ ఎన్నికల్లో నల్లగొండ కాంగ్రెస్ అభ్యర్థిగా నిలిచి గెలుపొందారు. రోడ్లు, భవనాలశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టారు. దీంతో ఇక్కడ కాంగ్రెస్ అభ్యర్థిత్వానికీ తీవ్ర పోటీ నెలకొన్నది. మెదక్, భువనగిరి రెండు స్థానాల్లోనూ సిట్టింగ్ ఎంపీలు అసెంబ్లీ బాట పట్టడంతో మార్పు తథ్యమైంది. అలాగే కరీంనగర్ సిట్టింగ్ ఎంపీగా ఉన్న బండి సంజయ్ సైతం కరీంనగర్ అసెంబ్లీ బీజేపీ అభ్యర్థిగా పోటీచేసి ఓటమి పాలయ్యారు. లేదంటే ఇక్కడ కూడా సిట్టింగ్ స్థానంలో మార్పు జరిగే అవకాశాలు ఉండేది.



సిద్దిపేట జిల్లా మ్యాప్

తెరపైకి ఆశావహులు


మెదక్, భువనగిరి, కరీంనగర్ లోక్‌సభ నియోజకవర్గాలకు సంబంధించి ప్రధాన పార్టీలు ఇప్పటిదాకా తమ అభ్యర్థులను ప్రకటించలేదు. బీఆర్‌ఎస్ లోక్‌సభ వారీగా సమావేశాలను నిర్వహించి అభ్యర్థులకు సంబంధించి అభిప్రాయ సేకరణ నిర్వహిస్తున్నది. కాంగ్రెస్ పార్టీ ఆశావహుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నది. బీజేపీ సైతం అభ్యర్థుల విషయంలో ఆచితూచి వ్యవహరిస్తున్నట్లు స్పష్టమవుతున్నది. ఈ మూడు నియోజకవర్గాల్లోనూ ప్రధాన పార్టీల అభ్యర్థిత్వాలకు ఆశావహులు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నారు.

- మెదక్ బీఆర్‌ఎస్ రేసులో మాజీ కలెక్టర్, ఎమ్మెల్సీ వెంకట్రామారెడ్డి, ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్లు వినిపిస్తున్నాయి. బీజేపీ నుంచి మాజీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు, మరో మాజీ మంత్రి ఈటల రాజేందర్ పేర్లు చర్చకు వసున్నాయి. కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి, మైనంపల్లి హన్మంతరావు పేర్లు ప్రచారం అవుతున్నాయి.
- కరీంనగర్‌లో బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ బండి సంజయ్ పేరు దాదాపు ఖాయమైనట్లేనన్న వాదన వినిపిస్తున్నది. బీఆర్‌ఎస్ నుంచి మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ పేరు ఖరారైనట్లుగా ఆ పార్టీ సభ్యులు భావిస్తున్నారు. గత ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన పొన్నం ప్రభాకర్ ప్రస్తుతం హుస్నాబాద్ ఎమ్మెల్యేగా గెలిచి మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. దీంతో ఆ పార్టీ అభ్యర్థిపై ఇంకా అస్పష్టత నెలకొన్నది.
- భువనగిరిలో బీఆర్‌ఎస్ తరఫున జిల్లా బాలకృష్ణారెడ్డి, అమరేందర్, దూదిమెట్ల బాలరాజు, ఇతరాత్ర నేతలు టికెట్ ఆశిస్తున్నట్లు సమాచారం. బీజేపీ తరఫున మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్‌తో పాటు పలువురి పేర్లు పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. అలాగే కాంగ్రెస్ నుంచి ఆశావహుల సంఖ్య భారీగానే ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది.

ఉచిత పాస్‌ల దందాలో ఏఈవో హస్తం!

- పట్టుబడిన వారిలో అతని కారు డ్రైవర్ ఒకరు
- గతంలోనూ అవినీతి ఆరోపణలపై బాసర నుంచి కొమురవెల్లికి బదిలీ
- తాజా వ్యవహారంలోనూ భాగస్వామ్యంపై విమర్శలు

చేర్యాల, ఫిబ్రవరి 5: కొమురవెల్లి మల్లన్న ఆలయ దర్శన ఉచితపాసుల విక్రయదందాలో ఆలయ ఏఈవో గంగా శ్రీనివాస్ వ్యవహారంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పునరుద్ధరణ కమిటీ సభ్యుల తనిఖీలో ఆదివారం పలువురు వలంటీర్లు పట్టుబడ్డ విషయం తెలిసిందే. వారి నుంచి పదుల సంఖ్యలో ఏఈవో శ్రీనివాస్ జారీ చేసిన పాసులు లభ్యమయ్యాయి. పట్టుబడిన వారిలో ఏఈవో కారు డ్రైవర్ ఉండడంతో ఆ అక్రమ దందాలో అతనికి సంబంధం ఉందన్న వాదనలకు బలం చేకూర్చుతున్నాయి. మల్లన్న భక్తులకు సేవలందించేందుకు నియమించిన వలంటీర్లు తమ విధులను విస్మరించి ద్వితీయశ్రేణి అధికారులకు సహకరిస్తుండడం కలకలం రేపుతున్నది. ఆలయాభివృద్ధికి పాటుపడిన దాతలకు, ఇతర సహాయకులకు పాసులు ఇవ్వడానికి ఆలోచించే అధికారులు వలంటీర్లకు మాత్రం అడిగిందే తడువుగా పాసులు అందించడం అనేక అనుమానాలు వెల్లువెత్తుతున్నాయి. ఉచిత పాసుల విక్రయంతో పట్టుబడిన వ్యవహారంలో ఆలయాధికారులు స్పందించిన తీరుపైనా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. గతంలో వలంటీర్లు ప్రత్యేక దర్శన టికెట్లు రీసైక్లింగ్ చేస్తూ పట్టుబడడంతో సంబంధిత ఇన్‌చార్జిపై వెంటనే చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం ఉచిత పాసుల విక్రయంలో ఏఈవో గంగా శ్రీనివాస్‌పై ఎలాంటి చర్యలకూ ఉపక్రమించకపోవడం వివాదాస్పదమవుతుంది. గతంలో బాసర సరస్వతి ఆలయంలో పనిచేసిన సమయంలో అవినీతికి పాల్పడినందుకు ఆయనను కొమురవెల్లికి బదిలీ చేశారు. అయితే, ఇక్కడ కూడా సక్రమంగా విధులు నిర్వర్తించడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆలయ పరిస్థితి చక్కబెట్టేందుకుగాను మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి ఇటీవల ప్రక్షాళన చర్యలు చేపట్టిన క్రమంలో ఏఈవో గంగా శ్రీనివాస్ వ్యవహారంపై ఏ విధంగా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.





నారాయణఖేడ్ నుంచి పండరీపూర్‌కు బయలుదేరిన మాఘవారి దిండియాత్ర

విఠలా.. హరి విఠలా..

- నారాయణఖేడ్ నుంచి పండరీపూర్‌కు మాఘవారి దిండియాత్ర

నారాయణఖేడ్, ఫిబ్రవరి 5: మహారాష్ట్రలోని పవిత్ర పుణ్యక్షేత్రమైన పండరీపూర్‌కు మాఘవారి దిండి యాత్ర సోమవారం నారాయణఖేడ్ నుంచి ప్రారంభమైంది. అంతర్గాం పీఠాధిపతి కరణ్ గజేంద్రభారతి మహరాజ్ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులు తలపై కళశం, తులసీ కోట ధరించి, విఠలా.. పాండురంగా అంటూ భజనలు చేస్తూ దిండియాత్రకు బయలుదేరారు. ఏకాంబ పీఠం నుంచి 102 సంవత్సరాలుగా దిండియాత్ర కొనసాగుతుండగా.. నారాయణఖేడ్‌లో 26 ఏళ్లుగా యాత్ర నిర్వహిస్తున్నారు. ప్రతీరోజు 30 కిలోమీటర్ల చొప్పున 300 కిలోమీటర్ల దూరంలో ఉన్న పండరీపూర్‌కు యాత్రికులు 10 రోజుల్లో చేరుకుంటారు. ఖేడ్‌లో దిండియాత్ర ప్రారంభోత్సవానికి ఏకాంబ పీఠాధిపతి అవదూత్ మహరాజ్ హాజరయ్యారు. నాయకులు, ప్రజాప్రతినిధులు ఆనంద్ స్వరూప్ షెట్కార్, సుధాకర్‌రెడ్డి, లక్ష్మీబాయిరవీందర్‌నాయక్, పండరిరెడ్డి, వివేకానంద్, దారం శంకర్ స్వాగతం పలికారు.

జిల్లాలోని బినామీ డీలర్ల లిస్టు ఇవ్వండి

- జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజ
- పట్టణంలోని రేషన్ దుకాణాల తనిఖీ

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 5: జిల్లాలో బినామీ డీలర్లు ఎక్కడ ఉన్నా వారి లిస్టు సత్వరమే ఇవ్వాలని సంబంధిత అధికారులను జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజ ఆదేశించారు. సిద్దిపేట పట్టణంలోని పలు రేషన్ దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ కమిషనర్ సూచన మేరకు సోమవారం ఆమె పట్టణంలోని రేషన్ దుకాణాలను సందర్శించారు. జిల్లాలో బినామీ డీలర్లు ఎవరైనా ఉన్నారా? అని ఆమె పరిశీలించారు. రేషన్ బియ్యం తూకంలో ఏమైనా సమస్యలు తలెత్తుతున్నాయా అని ఆరా తీశారు. గోదాం నుంచి రేషన్ దుకాణానికి బియ్యం చేరుతున్న క్రమంలో ఏవైనా సాంకేతికపరమైన లోపాలు ఎదురవుతున్నాయా? అంటూ డీలర్లను అడిగి తెలుసుకున్నారు. రేషన్ దుకాణాల ముందు క్యూలో ఉన్న వినియోగదారులను ప్రభుత్వం పంపిణీ చేస్తున్న నిత్యావసర వస్తువులు, బియ్యం ఎలా ఉన్నాయని, రేషన్ దుకాణం అందుబాటులో ఉంటుందా? ఇతరత్రా ఏమైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లావణ్య, రేషన్ డీలర్ల జిల్లా రాష్ట్ర అధ్యక్షుడు దొమ్మాటి రవీందర్, సిద్దిపేట పట్టణ రేషన్ దుకాణం నంబర్ 57వ పోగుల రేణుకా వీరేశం, దుకాణం నంబర్ 23 లక్కిరెడ్డి భానుప్రసాద్‌రెడ్డి, రంగధాంపల్లి దుకాణం నంబర్ 58 డీలర్ వీరేశం, స్థానిక కౌన్సిలర్ ఎడ్ల అరవిందరెడ్డి, అంగన్‌వాడీ టీచర్ వనిత, పలువురు పాల్గొన్నారు.



సిద్దిపేటలో రేషన్ దుకాణాల పనితీరును పరిశీలిస్తున్న జిల్లా పౌరసరఫరాల అధికారి తనుజ



ఆరోగ్యానికి గానుగ నూనె..

మారుతున్న కాలనుగుణంగా జీవనశైలిలో మార్పులు రావడంతో పాటు అనారోగ్య సమస్యలూ పెరుగుతున్నాయి. అయితే, రోగాలబారిన పడకుండా ఉండేందుకు ప్రస్తుతం అనేక మంది ఆర్గానిక్ ఆహారంపై మక్కువ చూపుతున్నారు. ఈ క్రమంలో వాటికి డిమాండ్ కూడా పెరిగింది.

సిద్దిపేట జిల్లా పొన్నాల గ్రామశివారులో రాజీవ్ రహదారి, దాబాల సమీపంలో గానుగ నూనె తీస్తున్నారు. దాదాపు 14 కిలోల పల్లీలు రెండున్నర గంటలు గానుగ పడితే 5 లీటర్ల నూనె వస్తుంది. హైదరాబాద్, కరీంనగర్, సిద్దిపేట పరిసర ప్రాంతాల ప్రజలు ఈ నూనెను కొనుగోలు చేస్తున్నారు. ఈ నూనె వాడడం వల్ల బీపీ, షుగర్, గుండె జబ్బులు కంట్రోల్ అవుతాయని నిర్వాహకులు చెబుతున్నారు.



– సిద్దిపేట జిల్లా స్టాఫ్ ఫొటోగ్రాఫర్



సమస్యలను పరిష్కరించాలంటూ ఆందోళన

పుల్‌కల్, ఫిబ్రవరి 5: పుల్‌కల్ మండల పరిధి బస్వాపూర్ గ్రామ శివారులోని ఆదర్శ పాఠశాలలోని సమస్యలు పరిష్కరించాలంటూ ఏబీవీపీ ఆధ్వర్యంలో విద్యార్థులు సోమవారం పాఠశాల ఎదుట ఆందోళనకు దిగారు. పాఠశాలలో తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ సరఫరా లేకపోవడంతో, విద్యార్థులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. ప్రిన్సిపాల్ జ్యోతిహెబ్సిబా వచ్చి సమస్యలు పరిష్కరిస్తానని హామీ ఇస్తేనే ఆందోళన విరమిస్తామంటూ మొండికేశారు. సమస్యలను పరిష్కరించాలంటూ ఎన్నోసార్లు ప్రిన్సిపాల్ దృష్టికి తీసుకెళ్లినా, పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమస్యలను పట్టించుకోని ప్రిన్సిపాల్‌ను విధుల నుంచి తొలగించాలంటూ ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు నినాదాలు చేశారు. పక్షం రోజుల్లోగా సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారమయ్యేలా చూస్తానని ప్రిన్సిపాల్ జ్యోతి హెబ్సిబా హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు.



పాఠశాల ఎదుట ఆందోళన చేస్తున్న ఆదర్శ పాఠశాల విద్యార్థులు

రెండో వివాహం చేసుకున్న యువకుడిపై కేసు

తూప్రాన్, ఫిబ్రవరి 5: వివాహం చేసుకుని వరకట్నం కోసం వేధింపులకు గురి చేయడమే కాకుండా, మరో యువతిని పెళ్లి చేసుకున్న యువకుడిపై, కుటుంబీకులపై, మధ్యవర్తులపై కేసు నమోదైంది. ఈ సంఘటన మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణంలో సోమవారం చోటుచేసుకున్నది. తూప్రాన్ పట్టణానికి చెందిన మోయినొద్దీన్ కామారెడ్డిలో ఇంటెలిజెన్స్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా పని చేస్తున్నాడు. అతని కుమారుడు ఇమ్రాన్‌ఖాన్ (31)కి హవేలీఘనపూర్ మండల కేంద్రానికి చెందిన షబానతో 2019లో వివాహం జరిగింది. వీరికి ఒక కూతురు జన్మించింది. 2020 డిసెంబర్ 21న భర్త ఇమ్రాన్, అత్తమామలు శారీరకంగా, మానసికంగా వేధించి ఇంట్లో నుంచి ఆమెను బయటకు పంపించారు. పలుమార్లు పంచాయితీలు నిర్వహించినా మార్పు రాకపోవడంతో 2022 మార్చి 19న హవేలీఘనపూర్ పోలీస్‌స్టేషన్‌లో వారిపై వరకట్నం వేధింపుల కేసు నమోదైంది. సోమవారం తూప్రాన్‌లోని ఓ ఫంక్షన్‌హాల్లో మనోహరాబాద్ మండలంలోని ఓ గ్రామానికి చెందిన యువతితో ఇమ్రాన్‌కు వివాహం జరిపించారు. ఈ విషయం తెలుసుకున్న భార్య షబాన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శివానందం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



శ్రీకాంత్ (ఫైల్)

జహీరాబాద్, ఫిబ్రవరి 5: ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొన్న సంఘటనలో విద్యార్థి మృతిచెందాడు. ఈ ప్రమాదం పట్టణంలో సోమవారం చోటుచేసుకున్నది. రాంనగర్‌కు చెందిన ఈడ్పే శ్రీకాంత్(17) ఝరాసంగం వెళ్లే రోడ్డులోని ఓ కళాశాలలో ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. ఉదయం కళాశాలకు ద్విచక్ర వాహనంపై వస్తున్నాడు. జహీరాబాద్ డిపోకు చెందిన బస్సు వెనక నుంచి వస్తున్నది. ఇది గమనించని శ్రీకాంత్ కళాశాల వైపు బైక్‌ను అకస్మాత్తుగా తిప్పడంతో బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో శ్రీకాంత్‌కు బలమైన గాయాలు కావడంతో జహీరాబాద్ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం సంగారెడ్డికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతిచెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ శ్రీకాంత్ తెలిపారు.

విద్యుదాఘాతంతో గాయాలు.. లైన్‌మన్ మృతి

చేగుంట, ఫిబ్రవరి 5: విద్యుదాఘాతంలో గాయపడిన లైన్‌మన్ చికిత్స పొందుతూ మృతిచెందాడు. చేగుంట మండలం చిన్నశివనూర్ గ్రామంలోని నార్సింగి గ్రామానికి చెందిన దాయం కృష్ణ(51) గ్రామ శివారులో ఉన్న సబ్‌స్టేషన్ పరిధిలో లైన్‌మన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆర్బిట్ ఇన్సులేటర్ పరిశ్రమలో ఆదివారం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతు చేస్తుండగా షాక్‌కు గురై కిందపడిపోయాడు. చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు చేగుంట ఎస్‌ఐ హరీశ్‌గౌడ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు 'సంస్కార్' విద్యార్థులు

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 5: సంగారెడ్డిలోని విశ్వా ఎడ్యుకేషన్ టెక్నాలజీ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన జోనల్ లెవల్ మెదక్ ఉమ్మడి జిలా అబాకస్, వేదిక్ మ్యాస్ పోటీల్లో పెద్దశంకరంపేటకు చెందిన సంస్కార్ విద్యాలయ విద్యార్థులు ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల కరస్పాండెంట్ సీతారామారావు సోమవారం తెలిపారు. విద్యాలయం నుంచి 14 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా, అబాకస్ విభాగంలో నాలుగో తరగతి చదువుతున్న అంబటి కౌశిక్ మొదటిస్థానం, వేదిక్ మ్యాస్‌లో ఏడో తరగతి చదువుతున్న రాగం సుదీక్ష ద్వితీయస్థానంలో నిలిచారని తెలిపారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన విద్యార్థులను ఉపాధ్యాయులు అభినందించారు.

షాపింగ్ కాంప్లెక్స్ పేరిట డబ్బులు వసూలు

● మున్సిపల్ చైర్మన్, కమిషనర్లపై జిల్లా ఎస్పీకి ఫిర్యాదు



మెదక్ ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మెదక్, ఫిబ్రవరి 5: మెదక్ పట్టణంలో నిరుద్యోగులకు ఉపాధి కల్పన కోసం షాపులు కేటాయిస్తామని మున్సిపల్ చైర్మన్, కమిషనర్ రూ. 4లక్షల 82వేలు డీడీల రూపంలో వసూలు చేశారని ఎమ్మార్పీఎస్, దళిత సంఘ నేతలు బాల్‌రాజ్, రాజు, రాజస్వామిలు జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశారు. షాపుల కేటాయింపులో జాప్యమెందుకు జరుగుతున్నదని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కమిషనర్ జానకిరామ్ సాగర్లను ప్రశ్నిస్తే బెదిరింపులకు దిగుతున్నారని వారు ఆరోపించారు. వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి న్యాయం చేయాలని వారు కోరారు.

మెదక్ రీజియన్‌కు ఆర్టీసీ కొత్త బస్సులు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 : ఆర్టీసీ మెదక్ రీజియన్‌కు ప్రభుత్వం కొత్త బస్సులను కేటాయించింది. ఇప్పటివరకు తొమ్మిది కొత్త బస్సులు రీజియన్‌లోని వివిధ డిపోలకు కేటాయించినట్లు రీజినల్ మేనేజర్ ప్రభులత తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని బస్సులు కొత్తవి రానున్నట్లు ఆమె పేర్కొన్నారు. అయితే రీజియన్‌కు వచ్చిన కొత్త బస్సులను త్వరలోనే జిల్లా మంత్రి దామోదర్ రాజనర్సింహ చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆర్టీసీ అధికారులు తెలిపారు.



కట్కూరులో సాగు చేసిన పొద్దుతిరుగుడు పంట

పొద్దు తిరిగింది..
బతుకు మారింది..!

- కట్కూరులో పొద్దుతిరుగుడు సాగు
- ఒకే గ్రామంలో 410 ఎకరాల్లో పంట
- తక్కువ పెట్టుబడి.. లాభాలు అధికం
- ఆసక్తి చూపిస్తున్న మిగతా రైతులు

అక్కన్నపేట, ఫిబ్రవరి 5: పొద్దుతిరుగుడు పంటకు ప్రస్తుతం మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉన్నది. అక్కన్నపేట మండలంలోని కట్కూరు గ్రామంలో 40 ఏళ్ల క్రితం పొద్దుతిరుగుడు పంటను ఎక్కువగా సాగు చేసేవారు. పక్షుల బెడద ఎక్కువ కావడంతో క్రమంగా ఈ పంటకు దూరమయ్యారు. దీనికి బదులుగా వరి, పత్తి, పంటల సాగు వైపు మొగ్గుచూపారు. అయితే చీడపీడలతో ఈ పంటల్లో రైతులకు నష్టాలే మిగులుతూ వచ్చాయి. అందులోనూ మెట్టప్రాంతం కావడంతో సరిపడా నీరు లేక సతమతమయ్యారు. అయితే పొద్దుతిరుగుడుకు డిమాండ్ ఉండడంతో ఏడేళ్ల క్రితం గ్రామంలోని రైతులు మళ్లీ సన్‌ఫ్లవర్ సాగువైపు మొగ్గు చూపారు. గ్రామ పరిధిలో 4 వేల ఎకరాల్లో సాగు భూమి ఉండగా రబీలో 2500 ఎకరాల్లోనే పంటలు వేశారు. అందులో 410 ఎకరాల్లో 204 మంది రైతులు ప్రస్తుతం ఈ పొద్దుతిరుగుడు పంటను సాగు చేస్తున్నారు. సిద్దిపేట జిల్లాతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఒకే గ్రామంలో ఇంత మొత్తంలో పొద్దుతిరుగుడు పంటను కట్కూరు గ్రామానికి చెందిన రైతులే సాగు చేయడం విశేషం.

తక్కువ పెట్టుబడి.. తక్కువ నీరు

పొద్దుతిరుగుడు పంట సాగు చేయడానికి తక్కువ నీరు అవసరం ఉంటుంది. దాదాపు 15 రోజులకు ఒకసారి పంటకు నీటి తడిని అందిస్తే సరిపోతుంది. ఎకరానికి సుమారుగా రూ.10 వేలు ఖర్చు పెడితే 8 నుంచి 12 క్వింటాళ్ల వరకు పంట దిగుబడి వస్తున్నది. గత సంవత్సరం పొద్దుతిరుగుడు పంటకు మద్దతు ధర రూ.6400 దక్కింది. ఇలా కట్కూరు గ్రామ రైతులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలను పొందుతున్నారు.

ఒక్కరిని చూసి మరొకరం



తక్కువ నీరు, పెట్టుబడి కూడా తక్కువే కావడంతో పాటు దిగుబడి ఎక్కువగా వస్తుండడంతో మా గ్రామంలో ఒక్కరిని చూసి మరొకరం పొద్దుతిరుగుడు పంటను సాగు చేస్తున్నాం. చీడపీడలు, అకాల వర్షాల వల్ల పొద్దుతిరుగుడు పంటకు ఎలాంటి నష్టం లేకపోవడంతో మా ఊరిలో రైతులు ఎక్కువగా ఈ పంట వైపే మొగ్గు చూపుతున్నారు.

- అన్నారపు దూలయ్య, రైతు, కట్కూరు

కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి



హుస్నాబాద్ మార్కెట్‌లో పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రం లేకపోవడంతో సిద్దిపేట మార్కెట్‌కు వెళ్లవలసి వస్తుంది. దీంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించి హుస్నాబాద్‌లోనే పొద్దుతిరుగుడు కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి.

- యాదిరెడ్డి, రైతు, కట్కూరు

వ్యవసాయాధికారుల సూచనలు పాటించాలి



పశువులు, పక్షుల నుంచి పంటను రక్షించుకునేదుకు తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. పంటకు ఏదైనా వ్యాధులు సంక్రమిస్తే వ్యక్తిగతంగా నిర్ణయాలు తీసుకోకుండా వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి దీంతో అధిక దిగుబడులు సాధించవచ్చు.

-పి.ఐశ్వర్య, మండల వ్యవసాయ విస్తరణ అధికారి

ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా అధికారులను ఆదేశించిన కలెక్టర్, అదనపు కలెక్టర్లు
- కలెక్టరేట్‌లకు జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 5: ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని మెదక్ కలెక్టర్ రాజర్షిషా అధికారులకు సూచించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి భారీగా తరలివచ్చారు. మొత్తం 98 దరఖాస్తులు రాగా అందులో భూ సమస్యలు 52, జనరల్ 25, పింఛన్లు 13, ఉపాధిపై 8 వినతులు వచ్చాయి. బాధితుల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించడంతోపాటు సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రమేష్, డీఆర్వో పద్మశ్రీ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. అలాగే జిల్లా పోలీసు కార్యాయలంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమ ఎస్పీ బాలస్వామి అర్జీలను స్వీకరించి వారితో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఎస్పీ ఆదేశించారు.

సంగారెడ్డి గ్రీవెన్స్‌కు 75 అర్జీలు

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 5 : సంగారెడ్డి కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు తదమ సమస్యలను పరిష్కరించాలని అదనపు కలెక్టర్ చంద్రశేఖర్‌కు అర్జీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చే దరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణిలో సిర్గాపూర్ మండలం గౌడ్‌గామ్ గ్రామంలో ప్రభుత్వం తమకు గృహనిర్మాణాల నిమిత్తం 38 మందికి పట్టాలిచ్చారని తెలిపారు. ఇదే గ్రామానికి చెందిన బిరాదర్ మారుతప్ప వారి కుమారులు దౌర్జన్యం చేసి తనను బెదిరించి భూమిని కబ్జాచేస్తున్నారని ఫిర్యాదు చేశారు. సిర్గాపూర్ మండల కేంద్రానికి చెందిన కుమ్మరి పండరి తనకు సంగారెడ్డి జిల్లా కోర్టులో అపాయింట్‌మెంట్ ఆర్డర్ ఇచ్చినా అధికారులు తనను తీసుకోవడం లేదని, ఐదేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని, న్యాయం చేయాలని అర్జీలో కోరారు. వీటితో పాటు రెవెన్యూ శాఖకు సంబంధించి 25 అర్జీలు రాగా, పింఛన్ ఇప్పించాలని, ఉపాధి చూపాలని వివిధ శాఖలకు సంబంధించి 50 అర్జీలు, మొత్తం 75 దరఖాస్తులు వచ్చినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన జిల్లా అధికారులు పాల్గొన్నారు.



సంగారెడ్డి కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అర్జీలను స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

బాధితులకు న్యాయం చేయాలి

సిద్దిపేట అగ్రికల్చర్, ఫిబ్రవరి 5 : ప్రజావాణికి వచ్చిన బాధితులకు న్యాయం చేయాలని సిద్దిపేట అదనపు కలెక్టర్ గరీమా అగ్రవాల్ పేర్కొన్నారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని సమావేశ మందిరంలో ప్రజావాణి నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి ఆమె దరఖాస్తులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి గొప్ప కార్యక్రమని, సామాన్యులకు అందుబాటులో ఉండి తమ సమస్యలను విన్నవించుకుని పరిష్కరించుకోడానికి చక్కని వేదిక అని తెలిపారు. ప్రజావాణికి తప్పనిసరిగా అధికారులు హాజరుకావాలని ఆమె ఆదేశించారు. భూ సంబంధిత, ఆసరా పింఛన్లు ఇతరత్రా మొత్తం కలిపి 28 దరఖాస్తులు వచ్చాయని ఆమె పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో నాగ రాజమ్మ, డీఆర్డీఏ పీడీ జయదేవ్ ఆర్యా, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు. బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల గ్రామం శివారులో నిర్మించనున్న ఇథనాల్ కంపెనీ అనుమతులను రద్దు చేయాలని ఆ గ్రామ ప్రజలు ప్రజవాణిలో ఫిర్యాదు చేశారు.

పోలీసులు శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలి

- ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగం పాత్ర చాలా కీలకం
- మెదక్ ఎస్పీ డా.బాలస్వామి
- ముగిసిన సాయుధ బలగాల శిక్షణ

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 5 : పోలీసు ఉద్యోగం ఒత్తిడితో కూడుకున్నదని, ఎప్పుడూ సిబ్బంది శారీరకంగా, మానసికంగా దృఢంగా ఉండాలని మెదక్ ఎస్పీ డాక్టర్ బాలస్వామి పేర్కొన్నారు. జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయ పరేడ్‌గ్రౌండ్‌లో సాయుధ బలగాలకు పదిహేను రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం సోమవారంతో ముగిసింది. ఈ శిక్షణలో పరేడ్, లాఠీడ్రిల్, మాబ్ ఆపరేషన్, ఆయుధాల వినియోగం, ఫైరింగ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. నాలుగు ప్లాటూన్లతో కూడిన పరేడ్ నిర్వహించారు. కమాండెడ్‌గా ఆర్ఐ అచ్యుత్‌రావు వ్యవహరించారు. శిక్షణలో ప్రతిభ చూపిన వివిధ విభాగాల సిబ్బందికి ఎస్పీ బాలస్వామి ప్రశంసాపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఏడాది ఒకసారి శిక్షణ కార్యక్రమం నిర్వహించుకుంటామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు ఎంతగానో కృషి చేస్తారన్నారు. వృత్తి నైపుణ్యాలను మెరుగుపరుకోవాలన్నారు. అనంతరం జిల్లా సాయుధ విభాగంలోని పోలీసు అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వీలైనంత త్వరలో వారి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ మహేందర్, ఏఆర్ డీఎస్పీ శ్రీరంగానాయక్, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ప్రశంసా పత్రాలను అందజేసి అభినందిస్తున్న ఎస్పీ బాలస్వామి

జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు పోటీలు

- డీఈవో వెంకటేశ్వర్లు

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 5 : జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9వ తేదీన జిల్లా స్థాయిలో విద్యార్థులకు పలు అంశాల్లో పోటీలను నిర్వహించనున్నట్లు డీఈవో వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రాథమిక, ఉన్నత పాఠశాలల విద్యార్థులకు పెయింటింగ్, కవిత్వం, పాటలు, ఉపన్యాస పోటీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. 6 నుంచి పదో తరగతి చదివే విద్యార్థులు ఈపోటీలకు అర్హులని పేర్కొన్నారు. ఈ నెల 6న పాఠశాల స్థాయిలో, 7న మండలస్థాయిలో, 9వ తేదీన జిల్లాస్థాయిలో జిల్లా సైన్స్ కేంద్రంలో పోటీలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఒక్కొక్క విభాగం నుంచి ముగ్గురు చొప్పున ఉత్తమ స్థానాలు పొందిన 12 మందిని రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నామన్నారు. వారికి ఈ నెల 28న జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్ రవీంద్రభారతిలో జరిగే కార్యక్రమంలో బహుమతి ప్రధానోత్సవ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. పూర్తి వివరాలకు సైన్స్ అధికారి 6302290235 నంబరును సంప్రదించాలని కోరారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనకు ఐదు ప్రాజెక్టులు ఎంపిక

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 5 : రాష్ట్ర విద్యా పరిశోధన సంస్థ, నేషనల్ ఇన్నోవేషన్ ఫౌండేషన్ ఆదేశాల మేరకు వర్చువల్ పద్ధతిలో నిర్వహించిన జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ప్రదర్శనలో రాష్ట్రస్థాయికి ఐదు ప్రాజెక్టులు ఎంపికైనట్లు జిల్లా విద్యాధికారి రాధాకిషన్ తెలిపారు. బంజారానగర్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి అభిలాష్‌గౌడ్ రూపొందించిన కదిలే బహుళార్థక సాధక నిచ్చెన, తూప్రాన్ కేజీబీవీకి చెందిన ఇద్దరు విద్యార్థులు జన్నా శ్రావణి మరియు పదార్థాలను గుర్తించే ఇండికేటర్, ప్రణతి రూపొందించిన స్మార్ట్ స్కూల్ బ్యాగ్, టేక్మాల్ జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి విష్ణునాయక్ తయారు చేసిన వ్యర్థ ప్లాస్టిక్ నుంచి ఇటుకల తయారీ, పాపన్నపేట జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి విష్ణువర్ధన్ రూపొందించిన దొంగతనం చేయడానికి వీలుకాని ఏటీఎం యంత్రం ప్రాజెక్టులు ఎంపికయ్యాయి.

221.40 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- తూప్రాన్ టోల్‌ప్లాజా వద్ద లారీ స్వాధీనం



తూప్రాన్ వద్ద పట్టుబడిన రేషన్ బియ్యం లారీ

తూప్రాన్, ఫిబ్రవరి 5 : భారీ ఎత్తున రేషన్ బియ్యం తరలిస్తుండగా పోలీసు, సివిల్ సప్లయ్ అధికారులు మెదక్ జిల్లా తూప్రాన్ పట్టణ పరిధి అల్లాపూర్ శివారులోని టోల్‌ప్లాజా వద్ద సోమవారం తెల్లవారుజామున పట్టుకున్నారు. తూప్రాన్ ఎస్ఐ శివానందం, సివిల్ సప్లయ్ అధికారుల కథనం ప్రకారం.. హైదరాబాద్ కాటేదాన్ నుంచి మెదక్ జిల్లా నార్సింగి మండల కేంద్రానికి అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్నారని విశ్వసనీయ సమాచారంతో ఎస్ఐ శివానందం, పౌరసరఫరాలశాఖ డిప్యూటీ తహసీల్దార్ సాదిక్ ఆధ్వర్యంలో తూప్రాన్ టోల్‌ప్లాజ్ వద్ద కాపుకాశారు. అక్రమంగా తరలిస్తున్న రేషన్(పీడీఎస్) బియ్యం లారీని పట్టుకున్నారు. 221.40 క్వింటాళ్ల బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. లారీడ్రైవర్ సలీమ్ మియాను అదుపులోకి తీసుకుని పోలీసులు విచారణ చేపట్టారు. కాటేదాన్ నుంచి నార్సింగి మండల కేంద్రానికి చెందిన బాబిసెట్ అలియాస్ శ్రావణ్‌కుమార్‌కు ఈ బియ్యం సరఫరా చేస్తున్నట్లు గుర్తించారు. లారీ డ్రైవర్ సలీం మియా, లారీ యజమాని ఖాన్‌సాబ్, కాటేదాన్ నుంచి బియ్యం పంపిస్తున్న వాజిద్‌అలీ, నార్సింగికి చెందిన బియ్యం కొనుగోలుదారు బాబీలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం వివరించారు. ఇదిలా ఉండగా ప్రభుత్వానికి సీఎస్ఆర్ కింద అందజేసేందుకు ఈ బియ్యం కొనుగోలు చేసినట్లు తెలిసింది.

విద్యార్థిని పట్ల అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడు

- ఆగ్రహంతో పాఠశాలకు వెళ్లిన విద్యార్థినీ కుటుంబీకులు

నంగునూరు, ఫిబ్రవరి 5 : విద్యాబుద్ధులు నేర్పించాల్సిన ఉపాధ్యాయుడే బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సిద్దిపేట జిల్లా నంగునూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఫిజిక్స్ బోధిస్తున్న ఉపాధ్యాయుడు తిరుపతి అదే పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థినితో కొన్నిరోజుల నుంచి అసభ్యంగా ప్రవర్తిస్తూ మానసికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలోనే శనివారం ల్యాబ్ రూమ్‌కు రమ్మని అసభ్యంగా ప్రవర్తించాడు. సదరు విద్యార్థిని ఈ విషయాన్ని క్లాస్ టీచర్‌తో పాటు తన కుటుంబీకులకు తెలిపింది. దీంతో వారు సోమవారం గ్రామస్థులతో కలిసి పాఠశాలకు వెళ్లారు. ఈ క్రమంలో పాఠశాలలో జరిగిన విషయంపై ఉపాధ్యాయులతో ఆరా తీస్తుండగా మధ్యలో వచ్చిన వంశీకృష్ణ అనే ఉపాధ్యాయుడిపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ దాడికి దిగారు. ఈ తంగాన్ని గమనించిన సదరు ఉపాధ్యాయుడు తిరుపతి తప్పించుకున్నట్లు సమాచారం. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో విషయం తెలుసుకున్న రాజగోపాల్‌పేట పోలీసులు అక్కడికి చేరుకొని ఇరువర్గాలకు నచ్చజెప్పారు. అలాగే ఎంఈవో దేశిరెడ్డి స్థానిక నాయకులు అంతా కలిసి సదరు ఉపాధ్యాయుడితో క్షమాపణ చెప్పించారు. దాంతో సమస్య సద్దుమణిగింది. అనంతరం గ్రామస్థులు ఉపాధ్యాయులతో మాట్లాడుతూ అసభ్యంగా ప్రవర్తించిన ఉపాధ్యాయుడిని విధుల నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. కాగా స్థానిక నాయకులు జోక్యం చేసుకొని ఇరువర్గాల మధ్య రాజీ కుదిరించినట్లు సమాచారం.



ఉపాధ్యాయులతో వాగ్వాదానికి దిగుతున్న విద్యార్థినీ కుటుంబీకులు, గ్రామస్థులు

సూపర్ స్టూడెంట్‌గా గురుకుల విద్యార్థి ఎంపిక

చేగుంట, ఫిబ్రవరి 5 : చేగుంట మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల క్రీడాపాఠశాల విద్యార్థిని రీజినల్ స్థాయిలో సూపర్ స్టూడెంట్‌గా ఎంపికైందని పాఠశాల ప్రిన్సిపాల్ వాణి తెలిపారు. బైపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అర్పిత రీజినల్ లెవెల్‌లో హైదరాబాద్‌లో జరిగిన పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించింది. సూపర్ స్టూడెంట్‌గా ఎంపికైన అర్పితకు రూ.1500 నగదు, ప్రశంసాపత్రాన్ని అందించినట్లు తెలిపారు. అర్పితను తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకులాల సంస్థ డిప్యూటీ సెక్రటరీ ఎం.శ్రీనివాస్‌రెడ్డి, ఓఎస్డీలు శ్రీనివాకుమార్, సుమలత అభినందించారు.



అర్పితను అభినందిస్తున్న ప్రిన్సిపాల్, అధికారులు



ఆధార్ అప్‌డేట్ కోసం పాట్లు

నారాయణఖేడ్ నియోజకవర్గవ్యాప్తంగా ఖేడ్ మున్సిపాలిటీ, ఎంపీపీ కార్యాలయం ఆవరణలోనే ఆధార్ కేంద్రాలు ఉన్నాయి. ఆధార్ అప్‌డేట్ కోసం అన్ని మండలాల నుంచి వందలాది మంది వస్తుండడంతో జనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. సోమవారం ఖేడ్‌లోని ఆధార్ కేంద్రాన్ని తెరువకముందే కేంద్రం ఎదుట ఆధార్‌కార్డులను, ధ్రువపత్రాలను వరుస క్రమంలో పెట్టారు.

- నారాయణఖేడ్, ఫిబ్రవరి 5



సిద్దిపేట రూరల్: విద్యార్థి బాలాజీని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాష్ట్రస్థాయి ప్రేరణ వైజ్ఞానిక పోటీలకు విద్యార్థుల ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సిద్దిపేటరూరల్/దుబ్బాక/హుస్నాబాద్, ఫిబ్రవరి 5: ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన జిల్లాస్థాయి ప్రేరణ మనక్ (వైజ్ఞానిక) పోటీల్లో సిద్దిపేట రూరల్ మండలంలోని రాఘవాపూర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి బాలాజీచారి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. కారులో బాలలు చిక్కుకుపోయినప్పుడు అప్రమత్తం చేసే వ్యవస్థకు సంబంధించిన ప్రాజెక్టును రూపొందించడంలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. బాలాజీని పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మంజు భార్గవి, గైడ్ టీచర్ గాడిపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. దుబ్బాక మండలం రామక్కపేటలోని టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్ గురుకుల పాఠశాల విద్యార్థులు కావ్య పూజ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని ఆ పాఠశాల ప్రిన్సిపాల్ ఉషాకిరణ్ తెలిపారు. ఈ విద్యార్థులు రూపొందించిన ప్రివెన్షన్ ఆఫ్ యాక్సిడెంట్ ఎట్ మ్యాన్ హోల్స్ అనే ప్రాజెక్టు ఎంపికైందని తెలిపారు. కార్యక్రమంలో గైడ్ టీచర్స్ సునీత, జ్యోతి, రాణి, ప్రవీణ్‌కుమార్ ఉన్నారు. అదేవిధంగా హుస్నాబాద్ పట్టణ సెయింట్ జోసెఫ్ పాఠశాల విద్యార్థిని పి నవ్యశ్రీ రూపొందించిన మల్టీ పర్పస్ అగ్రికల్చర్ మిషన్ ప్రాజెక్టు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ తెలిపారు. కాగా జిల్లా నుంచి రాష్ట్రస్థాయికి మొత్తం 15 ప్రాజెక్టులు ఎంపికైనట్టు చెప్పారు.

గ్రామ పంచాయతీల్లో స్పెషలాఫీసర్ల పాలన..

సమస్యలు పరిష్కారమయ్యేనా?

సిద్దిపేట అర్బన్, ఫిబ్రవరి 5 : ఐదేళ్లపాటు గ్రామ స్థాయిలో ప్రజాప్రతినిధులుగా సేవలందించిన సర్పంచుల పదవీకాలం ముగియడంతో ఆయా గ్రామాలకు ప్రభుత్వం స్పెషల్ ఆఫీసర్లకు బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సిద్దిపేట అర్బన్ మండలంలోని 12 గ్రామ పంచాయతీలకు మండల స్థాయి అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇంత కాలం గ్రామాల్లో చిన్న, పెద్ద ఉదయం లేచింది మొదలు స్థానిక ప్రజాప్రతినిధులను కలిసి స్వేచ్ఛగా తమ సమస్యలను చెప్పుకునేవారు. ప్రస్తుతం స్పెషలాఫీసర్లకు తమ చిన్న, పెద్ద సమస్యలను చెప్పుకుంటే ఎలా స్పందిస్తారో అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.



మిట్టపల్లి గ్రామపంచాయతీ కార్యాలయం

ప్రత్యేకాధికారులు.. సవాలక్ష సందేహాలు

గత ఐదేళ్లుగా గ్రామానికి సంబంధించిన ప్రజాప్రతినిధి తెల్లవారితే అదే గ్రామంలో ఉంటూ స్థానికంగా సమస్యలను తెలుసుకుంటూ పరిష్కరించే దిశగా ప్రయత్నాలను కొనసాగించారు అయితే మండల అధికారులను స్పెషల్ ఆఫీసర్లుగా నియమించడంతో వారు మండలంలోని తమ బాధ్యతలను నిర్వర్తిస్తూ గ్రామంలో అందుబాటులో ఉండేదెప్పుడని ప్రశ్నిస్తున్నారు. సమస్యల పరిష్కారం అయ్యేదెప్పుడో తెలియని అయోమయ పరిస్థితి ప్రజల్లో నెలకొనే అవకాశం లేకపోలేదంటున్నారు. పంచాయతీ కార్యదర్శులు పూర్తి బాధ్యతను నిర్వర్తిస్తారా.. లేక స్పెషల్ ఆఫీసర్‌లే గ్రామానికి ఇన్‌చార్జిగా వ్యవహరిస్తూ పూర్తి బాధ్యతలను నిర్వర్తిస్తారా? అనే సందేహాలు తలెత్తుతున్నాయి. గతంలో మండలస్థాయిలో పని ఉండి కార్యాలయాలకు వెళ్తే రోజుల తరబడి తిప్పుకునే అధికారులు ఇప్పుడు స్పెషల్ ఆఫీసర్లుగా వచ్చి తమ సమస్యలను ఏ మేరకు పరిష్కరించగలరనే అనుమానాలను ఆయా గ్రామాల ప్రజలు వ్యక్తం చేస్తున్నారు. ఏదేమైనా ప్రత్యేకాధికారులు గ్రామాల అభివృద్ధికి ఎంతవరకు సహాయ సహకారాలు అందించగలుగుతారు వేచి చూడాల్సిందే.

ప్రజలకు అందుబాటులో ఉంటాం



గ్రామ పంచాయతీల్లో స్పెషల్ ఆఫీసర్లుగా ప్రభుత్వం మమ్మల్ని నియమించింది. ప్రజా ప్రతినిధుల మాదిరిగానే మేము కూడా ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించేందుకు కృషి చేస్తాం. నిబంధనలు పాటిస్తూ అభివృద్ధి కార్యక్రమాలు నిరాటంకంగా కొనసాగేలా చూస్తాం. మాకు కేటాయించిన గ్రామాల్లో ప్రజలతో మమేకమై అంకితభావంతో విధులు నిర్వహిస్తాం.

- శ్రీనివాసరావు, ఎంపీవో, మిట్టపల్లి స్పెషలాఫీసర్

అందుబాటులో ఉంటారని ఆశిస్తున్నాం

సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో గ్రామాలకు వచ్చిన స్పెషల్ ఆఫీసర్లు ప్రజాప్రతినిధుల్లాగే అందుబాటులో ఉంటారని ఆశిస్తున్నాం. అప్పుడప్పుడు అధికారులు క్షేత్రస్థాయిలో తిరిగినవారే కాబట్టి ప్రజా సమస్యలపై అవగాహన కలిగి ఉంటారని అనుకుంటున్నాం. ఇన్‌చార్జిలు గ్రామాలను రోజువారీగా పర్యవేక్షించాలని కోరుకుంటున్నాం.

- ప్రభాకర్, పొన్నాల గ్రామస్థుడు

పదవీకాలం పొడిగిస్తే బాగుండేది

గ్రామ ప్రజలతో మమేకమై సమస్యలపై పూర్తి అవగాహన ఉన్న ప్రజాప్రతినిధుల పదవీ కాలాన్ని ఇంకా కొంతకాలం పొడిగిస్తే బాగుండేది. ఇంతకాలం కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో లేక ఇబ్బందులు ఎదుర్కొన్న గ్రామస్థులు ఇక నుంచి తమ వద్దకే స్పెషలాఫీసర్లు వచ్చి సమస్యలు తెలుసుకుని పరిష్కరించాలని కోరుకుంటున్నారు.

- రవి, ఎన్సాన్‌పల్లి గ్రామస్థుడు

బాలకృష్ణకు జ్యోతిష్య వాస్తు పురోహితరత్న పురస్కారం

కొండపాక, ఫిబ్రవరి 5: మండలంలోని తిమ్మారెడ్డిపల్లి గ్రామానికి చెందిన బాలకృష్ణ జ్యోతిష్య వాస్తు పురోహిత రత్న పురస్కారాన్ని అందుకున్నారు. తెలుగు సాహితీ వేదిక ఆధ్వర్యంలో వరంగల్ ఎన్జీవో భవన్‌లో సోమవారం జరిగిన కార్యక్రమంలో అవార్డును అందజేశారు. ఈ అవార్డును ఎమ్మెల్యే నాయని రాజేందర్ రెడ్డి, జడ్పీ చైర్మన్ సుందర్‌కుమార్, తెలుగు సాహితీ చైర్మన్ మోహన్ రావు, కోఆర్డినేటర్ రాజ్ కుమార్ అందజేశారు. ఈ సందర్భంగా బాలకృష్ణ వారికి కృతజ్ఞతలు తెలిపారు.



సత్కారాన్ని అందుకుంటున్న బాలకృష్ణ

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో గజ్వేల్ విద్యార్థుల ప్రతిభ

గజ్వేల్‌టౌన్, ఫిబ్రవరి 5: రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో గజ్వేల్ సెయింట్ మేరీస్ విద్యానికేతన్ పాఠశాలకు చెందిన లాస్య, సంస్కృతి, స్నిగ్ధశ్రీ ప్రతిభ చాటి మూడో స్థానంలో నిలిచారు. ఈ నెల 3,4 తేదీల్లో మెదక్ జిల్లా తూప్రాన్‌లో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్ కళాశాల బాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో 19 జిల్లాల జట్లు పాల్గొనగా, సిద్దిపేట జిల్లా జట్టు తరపున గజ్వేల్ సెయింట్ మేరీస్ విద్యానికేతన్ విద్యార్థులు పాల్గొని ప్రతిభ కనబరిచారు. సోమవారం సాఫ్‌బాల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శోభన్‌బాబు గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు.

చెకుముకి జిల్లాస్థాయి పరీక్షలో 'శ్రీవాణి' విద్యార్థుల ప్రతిభ

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 5: జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలను పురస్కరించుకుని గజ్వేల్ ప్రజ్ఞాపూర్‌లో శనివారం నిర్వహించిన పరీక్షల్లో సిద్దిపేట పట్టణం భారత్ నగర్‌లోని శ్రీవాణి స్కూల్ విద్యార్థులు ఆర్.ఐశ్వర్య, కె.కేదారినాథ్, వి.అనన్య ప్రతిభ కనబరిచి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి అందుకున్నారు. పాఠశాల డైరెక్టర్ సీహెచ్ సత్యం సోమవారం సదరు విద్యార్థులకు మెమొంటో అందజేసి అభినందనలు తెలిపారు.

స్పోర్ట్స్ మీట్‌లో శ్రీ చైతన్య విద్యార్థుల ప్రతిభ

హుస్నాబాద్, ఫిబ్రవరి 5: సిద్దిపేటలో జరిగిన శ్రీ చైతన్య విద్యా సంస్థల స్పోర్ట్స్ మీట్‌లో హుస్నాబాద్ పట్టణ శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు సాధించారు. జూనియర్ బాలుర కబడ్డీ పోటీల్లో మొదటి బహుమతి, జూనియర్ బాలికల కబడ్డీ పోటీల్లో ద్వితీయ బహుమతి, జూనియర్ బాలికల ఖో ఖో పోటీల్లో ద్వితీయ బహుమతి సాధించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రిన్సిపాల్ తిరుమల్, డీన్ తిరుపతి, పీఈటీలు రాజు, రమ్య అభినందించారు.

ఇన్విటేషన్ వాలీబాల్ టోర్నమెంట్‌లో
ఆర్అండ్ఆర్ కాలనీ జడ్పీహెచ్ఎస్ ఫస్ట్

గజ్వేల్, ఫిబ్రవరి 5: గజ్వేల్ పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాలలో క్రీడా జ్యోతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం బాలికల వాలీబాల్ ఇన్విటేషన్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ టోర్నమెంట్‌లో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఆర్అండ్ఆర్ కాలనీ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రథమ, ధర్మాజీపేట జడ్పీటీసీ పాఠశాల ద్వితీయ, తూప్రాన్ అభ్యాస ఇంటర్నేషనల్ పాఠశాల తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి వారితో క్రీడాజ్యోతి స్పోర్ట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు ఎంఎస్‌కే ప్రసాద్, ఉపాధ్యక్షురాలు విజయరేఖ, కార్యదర్శి గోవర్ధన్‌రెడ్డి, క్రీడాకారులు సంతోష్, ఆర్గనైజర్లు ప్రభు, సందీప్, కిరణ్, భానుప్రసాద్, విజయ్‌కుమార్‌లు హాజరయ్యారు.

గణితంలో ప్రతిభ కనబరిస్తే మంచి భవిష్యత్తు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

గజ్వేల్, ఫిబ్రవరి 5: గణితశాస్త్రంలో నిష్ణాతులైతే ఉన్నత స్థాయికి చేరుకోవచ్చని ఎమ్మెల్సీలు డాక్టర్ వంటేరి యాదవరెడ్డి, కూర రఘోత్తంరెడ్డి అన్నారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజ్ఞాపూర్ హైస్కూల్‌లో తెలంగాణ మ్యాథమెటిక్స్ ఫోరం ఆధ్వర్యంలో జిల్లాస్థాయి మ్యాథమెటిక్స్ టాలెంట్ టెస్టును నిర్వహించగా, వారు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు భయంతో గణితానికి దూరమవుతారన్నారు. గణితం, తెలుగు వ్యాకరణం నేర్చుకుంటే ఉన్నత స్థితికి చేరుకోవచ్చన్నారు. వారితో గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్.సీ రాజమౌళి తదితరులున్నారు.

బైక్ అదుపు తప్పి ఒకరికి తీవ్ర గాయాలు

కొండపాక, ఫిబ్రవరి 5: బైక్ అదుపు తప్పిన ఘటనలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కొండపాక శివారులో రాజీవ్ రహదారిపై సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూరు గ్రామానికి చెందిన నర్సయ్య(50) అనే వ్యక్తి బైక్‌పై కొమురవెల్లికి బయలుదేరాడు. ఈ క్రమంలో గ్రామంలో బైక్ అదుపుతప్పి డివైడర్ ఢీకొనడంతో కింద పడి చేయి విరిగిపోయింది. ఈ సమాచారమందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది వెంటనే ఘటనాస్థలానికి చేరుకొని బాధితుడిని సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు.

డ్రంకెన్‌డ్రైవ్‌లో ఆరుగురికి జరిమానా

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 5 : సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ సిద్దిపేట పట్టణంలో నర్సాపూర్ చౌరస్తా, ఎంపీడీవో ఆఫీస్ చౌరస్తాలలో రాజీవ్ రహదారిపై వారం రోజులుగా సిబ్బందితో కలిసి వాహనాల తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో ఆరుగురు మద్యం సేవించి వాహనాలు నడుపుతుండగా అదుపులోకి తీసుకున్నారు. సోమవారం సిద్దిపేట అడిషనల్ జడ్జి వి.శ్రావణి ముందు హాజరుపరచగా విచారణ చేసి ఆరుగురికి రూ.6000 జరిమానా విధించారు. వారిలో ఒకరికి జరిమానాతో పాటు రెండు రోజుల జైలు శిక్షను విధించారు.

సైబర్ నేరగాళ్లతో అప్రమత్తంగా ఉండాలి: సీఐ

హుస్నాబాద్, ఫిబ్రవరి 5 : సైబర్ నేరగాళ్ల పట్ల అప్రమత్తంగా ఉండాలని హుస్నాబాద్ సీఐ ఎర్రల కిరణ్ ప్రజలను కోరారు. సోమవారం ఆయన హుస్నాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. దీనికి ముందు హుస్నాబాద్ సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు, ఇన్వెస్టిగేషన్ అధికారులతో నేరాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. హుస్నాబాద్ పట్టణంలో వ్యాపారులు తమ వస్తువులను రోడ్డుపైన పెట్టవద్దని, దీని వల్ల ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడుతున్నాయని తెలిపారు. వ్యాపారులు తమ దుకాణాల ఎదుట పార్కింగ్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు తోట మహేశ్, తిరుపతి, వివేక్ తదితరులున్నారు.



ఎస్ఐలతో నేరాలపై సమీక్ష నిర్వహిస్తున్న సీఐ ఎర్రల కిరణ్

వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలి

సిద్దిపేట క్రైం, ఫిబ్రవరి 5 : వాహనదారులు ట్రాఫిక్ నియమాలను పాటించాలని సిద్దిపేట ట్రాఫిక్ ఎస్ఐ వినయ్‌సాగర్ వాహనదారులకు సూచించారు. శనివారం ఆయన సిద్దిపేట ఓల్డ్ బస్టాండ్ వద్ద ప్రజలు, వ్యాపారులకు, ప్రయాణికులకు, వాహనదారులకు రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

హుస్నాబాద్, ఫిబ్రవరి 5 : మాజీ సీఎం కేసీఆర్‌పై సీఎం రేవంత్‌రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ సోమవారం హుస్నాబాద్ పట్టణంలోని అక్కన్నపేట చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీని దహనం చేశారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. తెలంగాణ రాష్ట్రాన్ని సాధించి పదేళ్లలోనే అభివృద్ధి పథంలో నడిపించిన కేసీఆర్‌పై ఇష్టానుసారంగా మాట్లాడటం సరికాదన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత, వైస్ చైర్‌పర్సన్ అయిలేని అనిత, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

టీపీటీఎఫ్ మహాసభను విజయవంతం చేయండి

గజ్వేల్, ఫిబ్రవరి 5: టీపీటీఎఫ్ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ జోన్ కన్వీనర్ సుంచు నరేందర్ పిలుపునిచ్చారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని ఆయా పాఠశాలల్లో ఈ నెల 11, 12 తేదీల్లో, ఖమ్మంలో నిర్వహించనున్న రాష్ట్ర విద్యా, విజ్ఞానిక మహాసభల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన వెంట జిల్లా కార్యదర్శి విద్యాసాగర్, రవిందర్, తాళ్ల నాగరాజు, మోహన్‌రావు, ప్రదీపరాణి, మయూరి, అరుంధతి, ప్రేమలత, ఫౌజియ, వెంకటలక్ష్మి, మల్లేశం, అర్జున్, నర్సింగరావు తదితరులున్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగడదాం

● బీఆర్‌టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 5: కేంద్ర ప్రభుత్వ వ్యతిరేక విధానాలను ఎండగడుదామని బీఆర్‌టీయూ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు పిండి అరవింద్‌యాదవ్ పేర్కొన్నారు. సోమవారం సిద్దిపేట పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలు కార్మిక సంఘాల నాయకులు సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పిండి అరవింద్‌యాదవ్ మాట్లాడుతూ ఈ నెల 16న నిర్వహించనున్న దేశవ్యాప్త సమ్మెలో భాగంగా బీఆర్‌టీయూ అనుబంధ సంఘాలన్నీ అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని విజయవంతం చేయాలని ఏకగ్రీవ తీర్మానం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌టీయూ రాష్ట్ర కార్యదర్శి మంచే నర్సింహులు, బీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి నర్సింహులు, మెడికల్ అండ్ హెల్త్, రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్, బీడీ సంఘం సిద్దిపేట జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శోభన్, తదితరులు పాల్గొన్నారు.

ఆంగ్ల భాష నైపుణ్యంపై ప్రతిభా పోటీలు

కొండపాక, ఫిబ్రవరి 5: ఇంగ్లిష్ లాంగ్వేజ్ టీచర్స్ కొండపాక మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం కొండపాక బాలికల జడ్పీ ఉన్నత పాఠశాలలో డ్రామా స్పెల్ విజార్డ్ పోటీ కార్యక్రమాలు నిర్వహించారు. పోటీల అనంతరం స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు విఠల్ నాయక్ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ముఖ్య అతిథులుగా మండల నోడల్ ఆఫీసర్ విఠల్ టీఎస్ యూటీఎఫ్ సిద్దిపేట జిల్లా ప్రధాన కార్యదర్శి టి.యాదగిరి, తపస్ జిల్లా అధ్యక్షుడు రఘు వర్ధన్‌రెడ్డి, డీటీఎఫ్ రాష్ట్ర నాయకులు చంద్రబాబు, టీపీటీఎఫ్ జిల్లానాయకులు హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు.

వసతి గృహాల ఆకస్మిక తనిఖీ

గజ్వేల్‌టౌన్, ఫిబ్రవరి 5: గజ్వేల్ పట్టణంలో వెనుకబడిన తరగతుల కళాశాల వసతి గృహం, ప్రీ మెట్రిక్ వసతి గృహాలను, బాలుర కళాశాల వసతి గృహాలను సోమవారం జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ అధికారి సరోజ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె రికార్డులను పరిశీలించి పరీక్షలకు విద్యార్థులు ఏ విధంగా సిద్ధం కావాలో తగిన సూచనలు చేశారు.

'కాంగ్రెస్ ప్రభుత్వంలో దళిత జడ్పీటీసీకి దక్కని గౌరవం'

గజ్వేల్, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ ప్రభుత్వంలో దళిత జడ్పీటీసీకి గౌరవం దక్కడం లేదని గజ్వేల్ జడ్పీటీసీ పంగ మల్లేశం ఆవేదన వ్యక్తం చేశారు. గజ్వేల్ పట్టణంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఈ నెల 2న గజ్వేల్ మండలం కొడకండ్ల వద్ద మల్లన్నసాగర్ కాలువ ద్వారా కూడవెల్లి వాగులోకి సాగు నీటిని విడుదల చేసే కార్యక్రమానికి అటు అధికారులు గానీ, ఇటు ప్రజాప్రతినిధులు గానీ తనకు సమాచారం ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా ఖండించారు. అధికారులు ప్రొటోకాల్‌ను విస్మరించడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.

మెకానిక్స్ అసోసియేషన్ మండల అధ్యక్షుడిగా అనిల్

గజ్వేల్ రూరల్, ఫిబ్రవరి 5. గజ్వేల్ మండల టూ వీలర్ మెకానిక్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నిక సోమవారం గజ్వేల్ జరిగింది. మండలంలోని కొడకండ్ల గ్రామానికి చెందిన ఎనకపల్లి అనిల్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షుడిగా నర్సింహులు, సహాయ కార్యదర్శిగా విష్ణుమల్లేశం, కాజా పాషా, కోశాధికారిగా తోటరాజు, బి స్వామి, సలహాదారుడిగా నర్సింహులు, ధనరాజ్‌సింగ్, గౌరవ అధ్యక్షులుగా బేగే, ముక్రమ్, సత్యనారాయణను ఎన్నుకున్నారు.

నులిపురుగుల నివారణపై అవగాహన

తొగుట, ఫిబ్రవరి 5: మండల కేంద్రంలో సోమవారం రైతు వేదికలో జాతీయ నులిపురుగుల నివారణ కార్యక్రమంపై ఆరోగ్య, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలకు మండల వైద్యాధికారి రాధా కిషన్ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యులు సాగరిక, సుభాషిని, సీహెచ్‌వో స్వరూప పాల్గొన్నారు.

రంగనాయక్‌సాగర్ నీటితో చెరువులు నింపుతాం

నారాయణరావుపేట, ఫిబ్రవరి 5: సిద్దిపేట నియోజకవర్గంలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్ ద్వారా చెరువులు, కుంటలు నింపేందుకు కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు చొప్పదండి చంద్రశేఖర్ పేర్కొన్నారు. మండలంలోని జక్కాపూర్ గ్రామంలో రంగనాయకసాగర్ ద్వారా నీటితో నిండిన పోలవేణి కుంట, బతుకమ్మ చెరువుల్లో సోమవారం కాంగ్రెస్ నాయకులు గంగమ్మకు పూజలు చేసి జలహారతి పట్టారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ రంగనాయక సాగర్ ఎడమ కాలువతో నారాయణరావుపేట మండలంతో పాటు రాజన్న సిరిసిల్లా జిల్లా తంగళ్లపల్లి మండలంలోని పలు గ్రామాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. అసంపూర్తి కాలువల విషయాన్ని మంత్రుల దృష్టికి తీసుకెళ్లి నిర్మాణం పూర్తి చేసేలా చూస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నాయకులు మార్క సతీష్, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చింతల రాజ్‌వీర్, నాయకులు పల్లె శ్రీనివాస్, బుచ్చెల్లి రవి, రాగుల ఆశోక్ తదితరులు పాల్గొన్నారు.



నారాయణరావుపేట: గంగమ్మకు పూజలు చేసి జలహారతి చేసి పువ్వులు చల్లుతున్న కాంగ్రెస్ నాయకులు

● **మిరుదొడ్డి:** రైతుల సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తున్నదని ఆ పార్టీ సీనియర్ నాయకులు యాదవరెడ్డి పేర్కొన్నారు. సోమవారం అక్బర్‌పేట-భూంపల్లి మండలం మోతె గ్రామ శివారులోని కూడవెల్లి వాగులోకి గోదావరి నీరు రావడంతో కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రత్యేక పూజలను నిర్వహించారు.

అట్టహాసంగా శంబులింగేశ్వరుడి బ్రహ్మోత్సవాలు



ఆలయంలో కొలువైన శంభులింగేశ్వరస్వామి, ఆలయం చుట్టూ బండ్లను తిప్పుతున్న గ్రామస్థులు

కొండపాక, ఫిబ్రవరి 5: మండలంలోని దుద్దెడ స్వయంభు శంబులింగేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ ఉత్సవాలు మూడు రోజుల పాటు ఘనంగా జరుగనుండటంతో గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొన్నది. మొదటిరోజు పుణ్యాహవాచనము, అంకురార్పణ, మూలవిరాట్ అభిషేకము, అమ్మవారికి అభిషేకము, అలంకరణ, ఒడిబియ్యం, అన్నాభిషేకం తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం శకటోత్సవం కార్యక్రమంలో వాహనాలు, మోటార్ సైకిళ్లు, ట్రాక్టర్లు, ఎడ్లబండ్లను ఆలయం చుట్టూ తిప్పారు. అనంతరం తీర్థప్రసాద వితరణ చేశారు. కార్యక్రమాల్లో ట్రస్టు ప్రతినిధులు వివిధ గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ బలోపేతానికి గ్రామకమిటీలు

మద్దూరు, ఫిబ్రవరి 5: కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి గ్రామ కమిటీల నియామకాలు చేపట్టినట్టు మండల పార్టీ అధ్యక్షుడు బండి శ్రీనివాస్, యూత్ అధ్యక్షుడు చెట్కూరి కమలాకర్ యాదవ్, బెక్కల్ సర్పంచ్ కూకట్ల బాల్‌రాజ్, కొండాపూర్ ఎంపీటీసీ ఇస్లావత్ నముకు తెలిపారు. సోమవారం దూళిమిట్ట మండలం దుబ్బతండా, లింగాపూర్ గ్రామాల్లో గ్రామకమిటీలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యాయి. దుబ్బతండా గ్రామశాఖ అధ్యక్షుడిగా జాటోతు రమేష్, ఉపాధ్యక్షులుగా జాటోతు సీతారాం, భూక్య గోపాల్, ప్రధాన కార్యదర్శిగా జాటోతు తిరుపతి, కార్యవర్గ సభ్యులుగా లాలూ. నిమ్మ, మోహన్, రాజు, దేవి ఎన్నికయ్యారు. యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా జాటోతు ప్రవీణ్, ఉపాధ్యక్షుడిగా బానోత్ తరుణ్, కార్యదర్శిగా జాటోతు నవీన్, ఎన్నికయ్యారు. లింగాపూర్‌లో అధ్యక్షుడిగా ఇరిముల్ల అశోక్‌కుమార్, ఉపాధ్యక్షుడిగా దేవనబోయిన పాండు, ముక్క రాజు, ప్రధాన కార్యదర్శిగా చేవెళ్ల మహేశ్, కార్యదర్శిగా చెవెళ్ల శ్రీకాంత్, ఎర్ర రాజేందర్, కోశాధికారి పబ్బాల లింగయ్య కార్యవర్గ సభ్యులుగా కనకయ్య, సత్తయ్య, బాలకిషన్, చెన్నారెడ్డి, బాలయ్య ఎన్నికయ్యారు.

యూత్ అధ్యక్షుడిగా ఎర్ర నవీన్, ఉపాధ్యక్షులుగా మీస శేఖర్, కార్యదర్శిగా గద్దల రాజు, సభ్యులుగా శేఖర్, శ్రీకాంత్, రమేష్, రాకేష్, నితన్, రాకేష్ ఎన్నికయ్యారు. బీసీ సెల్ అధ్యక్షుడిగా కొలిపాక భూపతి, ఉపాధ్యక్షులుగా నంగి పరమేశ్వర్, ప్రధాన కార్యదర్శిగా ఎల్కపల్లి యాదయ్య, కార్యవర్గ సభ్యులుగా కుమార్, నవీన్, లింగయ్య, సోషల్ మీడియా కోఆర్డినేటర్ మల్లేశం ఎన్నికయ్యారు.

పంచాయతీ పాలకవర్గాల సేవలు మరువలేనివి



జగదేవ్‌పూర్: సర్పంచులను సన్మానించిన దృశ్యం

జగదేవ్‌పూర్, ఫిబ్రవరి 5: ఐదేళ్ల పాటు గ్రామాల్లో సేవలందించిన పంచాయతీల సర్పంచు, పాలకవర్గాల సేవలు మరువలేనవని ఎంపీపీ బాలేషంగౌడ్ కొనియాడారు. సోమవారం మండలంలోని ఇటిక్యాల గ్రామంలో సర్పంచ్‌ల ఫోరం మండలాధ్యక్షుడు నరేష్, పీఏసీఎస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో మండలంలోని 29 గ్రామాల సర్పంచ్‌లకు వీడ్కోలు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచులకు శాలువాలను కప్పి మెమొంటోలను అందజేశారు.

మిరుదొడ్డి: అక్బర్‌పేట-భూంపల్లి మండలం భూంపల్లి గ్రామంలో సర్పంచ్ బక్కి బాగ్యలక్ష్మి పదవీ కాలం పూర్తి అయిన సందర్భంగా సోమవారం పాలకవర్గ సభ్యులను శాలువాలతో సన్మానించారు.



మద్దూరు: సలాఖ్‌పూర్ పంచాయతీ పాలకవర్గాన్ని సన్మానిస్తున్న గ్రామస్థులు

● **మద్దూరు:** మండలంలోని సలాఖ్‌పూర్ గ్రామ సర్పంచ్ వంగ భాస్కర్‌రెడ్డి, ఉపసర్పంచ్ శ్రీధర్‌తో పాటు వార్డు సభ్యులకు సోమవారం సన్మానకార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌గౌడ్ పాలకవర్గ సభ్యులకు మెమొంటోలను అందజేసి శాలువాలతో ఘనంగా సన్మానించారు.



మిరుదొడ్డి: భూంపల్లిలో పాలకవర్గానికి సన్మానం

కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలి

గజ్వేల్, ఫిబ్రవరి 5: కేన్సర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పీవీ ఉమాశశి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో జంతుశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో కేన్సర్‌పై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ వివిధ రకాల కేన్సర్‌ల గురించి అవగాహన కల్పించారు. విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన, పోస్టర్ కాంపిటీషన్లను నిర్వహించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్

వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తా చాటుదాం

● కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



సిద్దిపేటలో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న నర్సారెడ్డి, పూజల హరికృష్ణ తదితరులు

సిద్దిపేట టౌన్, ఫిబ్రవరి 5: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ సత్తాను మరోసారి చాటుదామని కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పేర్కొన్నారు. సోమవారం సిద్దిపే పట్టణంలో ఈ నెల 6న నిర్వహించనున్న సభ ఏర్పాట్లను కాంగ్రెస్ పార్టీ సిద్దిపేట జిల్లా డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మైనంపల్లి హనుమంతరావు పర్యటన ఉన్నందున కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు ఆంక్షరెడ్డి, ఓబీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు సూర్యవర్మ, ఎన్ఎస్‌యూఐ కో ఆర్డినేటర్ దాసరి రాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ కౌన్సిలర్ జాతీయ అవార్డుకు చిత్తారి పద్మ

హుస్నాబాద్, ఫిబ్రవరి 5: బహుజన సాహిత్య అకాడమీ అందించే ఉత్తమ కౌన్సిలర్ జాతీయ అవార్డుకు హుస్నాబాద్ మున్సిపల్ కౌన్సిలర్ చిత్తారి పద్మ ఎంపికైనట్లు ఆ సంస్థ జాతీయ అధ్యక్షుడు నల్ల రాధాకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లో అవార్డు సెలక్షన్ సమావేశంలో పద్మకు ఎంపిక పత్రాన్ని అందించినట్లు పేర్కొన్నారు.